సాక్షి అనంతపురం

శుక్రవారం । 28 । మార్చి । 2025




టన్ను చీనీ రూ.23,100

అనంతపురం మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23,100 ప్రకారం ధర పలికాయి.



స్థిరంగా టమాట ధర

టమాట ధర స్థిరంగా కొనసాగుతోంది. కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.8 ప్రకారం ధర పలికింది.



దౌర్జన్యం.. దుర్మార్గం

ఏమాత్రం బలం లేకపోయినా కుటిల రాజకీయంతో ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకునేందుకు టీడీపీ ప్రజాప్రతినిధులు విశ్వప్రయత్నాలు చేశారు. రొద్దంలో వారి పాచిక పారకపోగా.. గాండ్లపెంట, రామగిరి ఎంపీపీలను తమ ఖాతాలోకి వేసుకోవాలని అరాచకానికి తెరతీశారు.

ఇందులో భాగంగానే ఆ రెండు ఎన్నికలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి. ముఖ్యంగా రామగిరిలో 'పరిటాల' కుటుంబం దౌర్జన్యకాండ అందరినీ బెంబేలెత్తిస్తోంది.



పెనుకొండ: యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్న తహసీల్దార్ కార్యాలయ ఆవరణ

- రామగిరి ఎంపీపీ ఎన్నికను అడుగడుగునా అడ్డుకునే యత్నం
- ప్లాన్ ప్రకారం ఎన్నిక వాయిదా వేయించిన వైనం
- వైఎస్సార్‌సీపీ సభ్యురాలు భారతి కిడ్నాప్
- గాండ్లపెంటలోనూ సమయం దాటిందని ఎన్నిక వాయిదా



పెనుకొండ: తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించిన మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ శ్రేణులు



పెనుకొండ తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ కోసం వచ్చిన రామగిరి ఎంపీటీసీలు



మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

సాక్షి, పుట్టపర్తి/ పెనుకొండ రూరల్/ పెనుకొండ: ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రత్యర్థులను ఎదుర్కొనే సత్తా లేక 'పరిటాల' కుటుంబం పైశాచిక రాజకీయం చేసింది. రౌడీయిజం చేస్తూ.. దౌర్జన్యకాండ సృష్టించి.. అధికారులను అడ్డు పెట్టుకుని ఎంపీపీ ఎన్నికల్లో పైచేయి సాధించాలని ప్రయత్నించింది. సజావుగా ఎన్నిక జరిగితే ఓడిపోతామని తెలిసే ఎమ్మెల్యే పరిటాల సునీత దిగజారుడు రాజకీయానికి శ్రీకారం చుట్టారు. అధికారులను పావులుగా వాడుకొని వైఎస్సార్‌సీపీ సభ్యులను బెదిరించి, ప్రలోభాలకు గురి చేసి, పదవులను ఆఫర్ చేసి లాక్కోవాలనే ప్రయత్నం చేశారు. ప్లాన్ ఫలించకపోయేసరికి ఎన్నికను వాయిదా వేయించారు.

అభ్యర్థి లేకున్నా..

రామగిరి ఎంపీపీ పదవి మహిళకు రిజర్వు చేసిన సంగతి తెలిసిందే. అయితే టీడీపీ తరఫున ఒక్క పురుషుడు మాత్రమే గెలిచారు. పార్టీ ఫిరాయించిన మరో ఇద్దరు కూడా పురుషులే కావడంతో రామగిరి నుంచి టీడీపీ తరఫున నామినేషన్ వేసేందుకు కూడా అభ్యర్థి లేరు. అయితే ప్రలోభాలకు గురి చేసి వైఎస్సార్‌సీపీ సభ్యులను లాక్కొని టీడీపీ కండువా వేసి ఎంపీపీ పదవి చేజిక్కించుకోవాలని పరిటాల సునీత వేసిన ప్లాన్ అట్టర్‌ఫ్లాప్ అయింది. రామగిరి మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలకు 9 చోట్ల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిచారు. అందులో ఎంపీపీగా ఉన్న మీనుగ నాగమ్మ మరణించారు. ఎంపీపీ పదవి దక్కాలంటే కనీసం ఐదుగురు మద్దతు అవసరం. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ తరఫున ఐదుగురు సభ్యులు బెంగళూరు క్యాంపులో ఉన్నారు.

కావాలనే కాలయాపన..

వైఎస్సార్‌సీపీ సభ్యులు గురువారం బెంగళూరు నుంచి రామగిరికి ఎన్నికల కోసం వస్తుండగా.. బాగేపల్లి టోల్ ప్లాజా వద్దకు పోలీసులు చేరుకుని.. హైకోర్టు ఉత్తర్వుల మేరకు బందోబస్తు మధ్య రామగిరి తీసుకెళ్తామని.. మిగతా వాళ్లు రాకూడదని సూచించారు. ఏడు వాహనాల్లో వైఎస్సార్‌సీపీ సభ్యులతో రామగిరికి బయలుదేరారు. అయితే కాన్వాయ్ చెన్నేకొత్తపల్లి దాటే సమయానికి మధ్యాహ్నం 12 గంటలైంది. ఆ సమయానికి రామగిరి ఎంపీడీఓ కార్యాలయానికి ముగ్గురు సభ్యులు మాత్రమే చేరుకోవడంతో నామినేషన్ దాఖలు చేసేందుకు గడువు మీరింది. దీంతో ఎన్నికను మరుసటి రోజుకు వాయిదా వేస్తున్నట్లు ప్రిసైడింగ్ ఆఫీసర్ సంజీవయ్య ప్రకటించారు.

ఎమ్మెల్యేతో వీడియో కాల్స్..

రామగిరి ఎంపీపీ ఎన్నిక వాయిదా పడినట్లు తెలియడంతో వైఎస్సార్‌సీపీ సభ్యులను తిరిగి కర్ణాటక సరిహద్దు దాటించే వరకూ పోలీసులు బందోబస్తులో ఉండాలి. అయితే ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ కల్పించుకుని వైఎస్సార్‌సీపీ సభ్యులతో వీడియో కాల్స్ ద్వారా పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌తో మాట్లాడించారు. పదవులు ఆఫర్ చేసి.. డబ్బు ద్వారా ప్రలోభాలకు గురి చేశారు. పార్టీ మారకుంటే ఇబ్బందులు తప్పవని బెదిరించారు. అయితే వైఎస్సార్‌సీపీ సభ్యులందరూ ఒకే మాటపై నిలబడి.. పార్టీ మారే ప్రసక్తే లేదని తెగేసి చెప్పారు.

మహిళా ఎంపీటీసీ కిడ్నాప్..

లీగల్ ప్రొసీజర్ ప్రకారం వైఎస్సార్‌సీపీ సభ్యులను పెనుకొండ తహసీల్దార్ కార్యాలయానికి తరలించాలని పోలీసులు సూచించారు. దీంతో తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లారు. అయితే పక్కా ప్లాన్‌తో వచ్చిన టీడీపీ నేతలు వాహనాల్లో వచ్చి పేరూరు -2 ఎంపీటీసీ సభ్యురాలు భారతిని బలవంతంగా తమ కారులో ఎక్కించుకుని వెళ్లిపోయారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తహసీల్దార్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించినా పోలీసులు అడ్డుకున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడికి యత్నించారు. మహిళా అభ్యర్థి ఉంటే.. నామినేషన్ దాఖలు చేసి.. ఏదో విధంగా బెదిరించి పార్టీ మార్చుకోవచ్చనే ఆలోచనతో పరిటాల సునీత దళిత మహిళను ఇరకాటంలో పడేశారు. ఈ క్రమంలో పోలీసుల తీరును ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ రోడ్డుపై బైఠాయించారు.

పరిటాల కోసమే పని చేస్తున్నారా?

హైకోర్టు ఆదేశాల మేరకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు పరిటాలకు అనుకూలంగా పని చేయడం దారుణం. పోలీసులు తమ పని తాము చేస్తే.. ఓ దళిత మహిళ ఎలా కిడ్నాప్‌నకు గురవుతుంది. పరిటాల కుటుంబానికి అనుకూలంగా పని చేసేందుకే వచ్చి ఉంటే యూనిఫాం తీసి.. పచ్చ కండువా వేసుకుని తిరగండి. అసలు పోలీసులు పరిటాల సునీతతో ఫోన్ కాల్స్ మాట్లాడించాల్సిన అవసరం ఏముంది. మొన్నటి దాకా సెలవులో ఉన్న ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ ఉన్నఫలంగా డ్యూటీకి ఎందుకొచ్చాడు. పరిటాల సునీతకు ఊడిగం చేసేందుకే వచ్చాడా?

– తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే

- ఇక.. గాండ్లపెంటలో బలంలేకపోయినా ఎంపీపీ పదవిని దక్కించుకునేందుకు టీడీపీ కుటిల యత్నాలకు తెరలేపింది. మండలంలో 7 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ఒకచోట మాత్రమే టీడీపీ గెలుపొందింది. అయితే, గురువారం ఎంపీడీఓ కార్యాల యంలో ఎంపీపీ ఎన్నిక కోసం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు కదిరి నుంచి గాండ్లపెంటకు బయలు దేరగా.. మార్గమధ్యలో కదిరి–రాయచోటి ప్రధాన రహదారిలో పోలీసులు సోదాల పేరుతో అడ్డుకున్నారు. దీంతో ఆలస్యం జరిగి ఎన్నికల అధికారి ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

'పచ్చ' కుట్రలు.. పటాపంచలు



కంబదూరు ఎంపీపీగా లక్ష్మీదేవి ఎన్నికకు మద్దతు తెలుపుతూ చేతులెత్తిన ఎంపీటీసీలు (ఇన్‌సెట్) లక్ష్మీదేవి

- జిల్లాలో ఖాళీ అయిన రెండు ఎంపీపీ, నాలుగు వైస్ ఎంపీపీ స్థానాలకు ఉప ఎన్నిక
- అన్ని చోట్లా వైఎస్సార్ సీపీ అభ్యర్థులే గెలుపు



కంబదూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

అనంతపురం: కేసుల పేరిట బెదిరింపులకు పాల్పడ్డారు. మాట వినకపోతే కిడ్నాప్ చేస్తామంటూ భయపెట్టారు. అంతు చూస్తామంటూ హెచ్చరించారు. చివరికి డబ్బు వల వేసి ప్రలోభాలకు గురి చేశారు. అయితే, వైఎస్సార్ సీపీ ఎంపీటీసీల ఆత్మవిశ్వాసం ముందు అవన్నీ పటాపంచలే అయ్యాయి. గుర్తింపునిచ్చిన వైఎస్సార్‌సీపీని వీడే ప్రసక్తే లేదనే కరాఖండిగా చెబుతూ తమ పార్టీ నాయకులనే ఎన్నుకుని జననేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పట్ల అభిమానాన్ని చాటుకున్నారు. జిల్లాలో గురువారం జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో అన్ని చోట్లా వైఎస్సార్‌సీపీ విజయ కేతనం ఎగురవేసింది. కణేకల్లు, కంబదూరులో ఎంపీపీ, ఉరవకొండ, పెద్దపప్పూరు, రాయదుర్గం, యల్లనూరులో వైస్ ఎంపీపీలుగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులే ఎన్నికయ్యారు. ఇక.. శ్రీ సత్యసాయి జిల్లాలో రొద్దం మండలాధ్యక్షుడి ఎన్నిక జరగగా, వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. రామగిరి, గాండ్లపెంట ఎంపీపీ ఎన్నిక నేటికి వాయిదా పడింది. టీడీపీ అరాచకాలను ముందే పసిగట్టిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తలు ఎంపీటీసీలకు దన్నుగా నిలిచి.. వారిలో ధైర్యాన్ని నింపారు.

కంబదూరులో పారని 'పచ్చ' పాచిక

కంబదూరు ఎంపీపీ స్థానాన్ని దక్కించుకునేందుకు టీడీపీ కుట్రలు పన్నింది. ఎన్నిక సందర్భంగా 'పచ్చ' నాయకులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. ఎంపీటీసీలను ప్రలోభాలకు గురిచేశారు. ఒక్కొక్కరికి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు ఇస్తామని బేరసారాలు చేశారు. ఈ క్రమంలోనే 'తెలుగు తమ్ముళ్లు' ఏకంగా డీఎస్పీ, ఆర్డీఓ వాహనాలపై రాళ్ల దాడికి యత్నించారు. జేబుల్లో కారం పొడి.. రాళ్లతో వచ్చి వీరంగం సృష్టించారు. అరగంట పాటు విద్యుత్‌కు అంతరాయం కలిగించారు. మండలంలోని ఒంటారెడ్డిపల్లి వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ ఏనుముల సోమశేఖర్‌ను ఎన్నికకు అరగంట ముందు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆయన ఎలాగోలా వారి నుంచి తప్పించుకుని వచ్చి ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడం గమనార్హం. ఇక.. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీపీగా రాళ్ల అనంతపురం ఎంపీటీసీ కే. లక్ష్మీదేవిని ఎన్నుకుంటూ వైఎస్సార్ సీపీ సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మాన ప్రతిని ములకనూరు ఎంపీటీసీ తిమ్మరాజమ్మ చింపివేయడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ఎన్నిక మధ్యలో ప్రిసైడింగ్ ఆఫీసర్ మద్దిలేటి అస్వస్థతకు గురి కావడం కలకలం రేపింది. వెంటనే ఆయన్ను కంబదూరు ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ వెంటనే ఎంపీడీఓ కార్యాలయం చేరుకుని ఎన్నికల అధికారిగా శెట్టూరు తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టిని నియమించి..ప్రక్రియను పూర్తి చేయించారు. ఎంపీపీగా లక్ష్మీదేవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జేసీ ప్రకటించారు.

మిగిలిన చోట్ల ప్రశాంతం..

జిల్లాలో ఒక్క కంబదూరు మినహా అన్ని ప్రాంతాల్లోనూ ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అన్ని చోట్లా వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు బలపరిచిన వారే ఎంపీపీ, వైస్ ఎంపీపీలుగా ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారుల నుంచి డిక్లరేషన్ అందుకున్నారు. కొత్తగా ఎన్నికైన వారిని పార్టీ నాయకులు సన్మానించారు. కాగా, ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

● నూతనంగా ఎంపీపీ, వైస్ ఎంపీపీలుగా ఎన్నికైన వారు..



వండ్రయ్య ఎంపీపీ, కణేకల్లు



ప్రసాద్ గౌడ్ వైస్ ఎంపీపీ, ఉరవకొండ



వి. నాగవేణి, వైస్ ఎంపీపీ, పెద్దపప్పూరు



అరుణ్ కుమార్, వైస్ ఎంపీపీ, రాయదుర్గం



రమాదేవి, వైస్ ఎంపీపీ, యల్లనూరు

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో చోటు



పెన్నోబులేసు



ఎగ్గుల శ్రీనివాసులు



సీ.రాజగోపాల్



పొరాళ్ల శివ

అనంతపురం కార్పొరేషన్/రాయదుర్గం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో జిల్లాకు చెందిన పలువురికి చోటు లభించింది. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మాల్యవంతం పెన్నోబులేసు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చామలూరు రాజగోపాల్, రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎగ్గుల శ్రీనివాసులు నియమితులయ్యారు. అలాగే, సహాయ కార్యదర్శులుగా బసాపురం గోవిందు, ఏసీ ఎర్రిస్వామి, వలంటీర్స్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జంగాలపల్లి జిలాన్ బాషా, రాష్ట్ర కార్యదర్శిగా చీమకుర్తి రవితేజ, సహాయ కార్యదర్శిగా ఏలూరు జయరామిరెడ్డి, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా చందచంద్రమ్మ, పొరాళ్ల శివను నియమించారు.

42 రోజుల టీటీసీకి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: వేసవిలో టెక్నికల్ ట్రైనింగ్ (టీటీసీ–42 రోజులు) కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఎం.ప్రసాద్ బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నంబర్–2లో కోర్సు నిర్వహిస్తారని పేర్కొన్నారు. మే 1 నుంచి జూన్ 11 వరకు శిక్షణ ఉంటుందని, ఏప్రిల్ 3 నుంచి 25 లోపు www.bse.ap.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆఫ్‌లైన్ అప్లికేషన్‌లు అంగీకరించమన్నారు. ఈ ఏడాది మే 1 నాటికి 18 సంవత్సరాలు నిండి 45 సంవత్సరాల లోపు వయసు ఉండాలని వెల్లడించారు.

ఇవీ విద్యార్హతలు

10వ తరగతి పాస్ అయ్యి టీసీసీ లోయర్ పూర్తి చేసిన వారు, ఎస్‌ఎస్‌సీ ఒకేషనల్ కోర్స్ చేసిన వారు, ఇంటర్ బోర్డు జారీ చేసిన ఒకేషనల్ ఉత్తీర్ణత సర్టిఫికెట్ కలిగిన వారు, స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్, ట్రైనింగ్ జారీ చేసిన సర్టిఫికెట్ ఉన్న వారు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఐటీఐ ఇన్‌స్టిట్యూట్ జారీ చేసిన నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ కలిగినవారు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ హ్యాండ్లూమ్ వీవింగ్ వారు జారీ చేసిన పాస్ సర్టిఫికెట్ ఉన్న వారు, తెలుగు విశ్వ విద్యాలయం జారీ చేసిన కర్ణాటక మ్యూజిక్ (ఓకల్, వీణ, వయోలిన్)లో డిప్లొమా సర్టిఫికెట్, ఏదైనా యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ సర్టిఫికెట్ కలిగినవారు అర్హులు.

అంతర్జాతీయ స్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతం

- పార్టీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కో–ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: అంతర్జాతీయ స్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని పార్టీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కో–ఆర్డినేటర్‌గా నియమితులైన ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. పదవి అప్పగించినందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ అభిమానులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే గొప్ప అవకాశం కల్పించారన్నారు. గతంలో జగనన్న పాలనకు అంతర్జాతీయంగా ఎంతో మద్దతు లభించిందన్నారు. ఈ బంధాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ప్రతి దేశంలో నమ్మకమైన ఎన్‌ఆర్‌ఐ చాప్టర్లు ఏర్పాటు చేసి, కార్యకర్తలకు మార్గనిర్దేశనం చేస్తానన్నారు. గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలపై ఎన్‌ఆర్‌ఐలతో అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. జగనన్న ఆశయాలను ప్రపంచ వ్యాప్తంగా ఎన్‌ఆర్‌ఐలకు వివరించేలా కృషి చేస్తానన్నారు. ప్రతి వైఎస్సార్ సీపీ అభిమాని ఈ ప్రయాణంలో తోడుగా ఉండాలని కోరారు.



వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో ఆలూరు సాంబశివారెడ్డి

బియ్యం కోటాలో కోత

- 600 టన్నుల మేర కట్
- కొన్ని స్టోర్లకు జీరో అలాట్‌మెంట్
- లబోదిబోమంటున్న డీలర్లు

అనంతపురం అర్బన్: పేదల సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోంది. పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యానికి సంబంధించి జిల్లా కోటా (అలాట్మెంట్)లో కోత పెట్టింది. జిల్లాకు ప్రతి నెలా 9,400 టన్నుల బియ్యం కేటాయింపు ఉంటుంది. అయితే ఏప్రిల్‌కు సంబంధించిన కోటాలో దాదాపు 600 టన్నులు కోత పెట్టినట్లు తెలిసింది. మరో విచిత్రమేమంటే కొన్ని చౌక దుకాణాలకు జీరో అలాట్‌మెంట్ చూపారు. కోటా తగ్గించడం, కొన్ని స్టోర్లకు పూర్తిగా కోత పెట్టడంతో డీలర్లు ఆందోళనకు గురై ఎమ్మెల్యేల వద్దకు పరుగులు పెట్టినట్లు తెలిసింది. మరోవైపు బియ్యం కోటాలో పెద్దమొత్తంలో కోత పెట్టడంతో అధికారులు కూడా అయోమయంలో పడినట్లు తెలిసింది. డీలర్లకు కోటా మేరకు ఇవ్వకపోతే చాలా సమస్య వస్తుందని ఆందోళన చెందుతున్నారు.



సగటు, సీబీ తీసివేయడంతో..

జిల్లాలో గడిచిన మూడు (జనవరి, ఫిబ్రవరి, మార్చి) నెలల్లో జరిగిన బియ్యం పంపిణీని సగటుగా తీసుకోవడంతో పాటు... మార్చి నెల క్లోజింగ్ బ్యాలెన్స్ (సీబీ) తీసివేసి ఏప్రిల్ నెలకు బియ్యం కోటా అలాట్‌మెంట్‌ను ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఈ క్రమంలో జిల్లాకు వాస్తవ అలాట్‌మెంట్ కంటే దాదాపు 600 టన్నులు తగ్గించినట్లు తెలిసింది. ఇంకో నాలుగు రోజుల్లో కార్డుదారులకు బియ్యం పంపిణీ ప్రారంభమవుతుంది. ఆ లోపు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

జిల్లాలో చౌకదుకాణాలు	1,645
బియ్యం కార్డులు	6,60,330
తెల్లకార్డులు	6,07,959
ఏఏవై కార్డులు	52,371
పురుషులు	9,71,251
మహిళలు	9,80,503

కమిషనర్ దృష్టికి తీసుకెళ్లా



జిల్లాకు బియ్యం అలాట్‌మెంట్ తగ్గిన విషయాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులు నా దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే పౌర సరఫరాల శాఖ కమిషనర్ దృష్టికి విషయం తీసుకెళ్లాను.

– శివ్ నారాయణ్ శర్మ, జాయింట్ కలెక్టర్

● తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళలు

రాయదుర్గంటౌన్: తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపిన ఘటన రాయదుర్గం పట్టణంలో జరిగింది. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో దాదాపు వారం రోజుల నుంచి సక్రమంగా తాగునీరు సరఫరా కావడం లేదు. ఈ క్రమంలో గురువారం 22వ వార్డు దళిత కాలనీకి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో మొలకల్మూరు రహదారిపై బైఠాయించారు. అధికారుల తీరును ఎండగట్టారు. 9 రోజుల నుంచి తమ వార్డులో నీరు సరఫరా కావడం లేదన్నారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. మహిళలు దాదాపు గంటకుపైగా బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ ఏఈ నరసింహులు అక్కడికి చేరుకుని మహిళలకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయితే, సమస్యపై అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని, నీరు సరఫరా చేసి మాట్లాడాలని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

ఫ్యాప్టో డిప్యూటీ సెక్రెటరీ జనరల్‌గా 'నీలూరు'



నీలూరు రమణారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా నీలూరు రమణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు రోజుల క్రితం అనంతపురంలో ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) సంఘం నుంచి జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణారెడ్డిని డిప్యూటి సెక్రెటరీ జనరల్‌గా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రామాంజనేయులు ప్రతిపాదించగా ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులు ప్రకటించారు.

'పీఎంజేఏవై'కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య (పీఎంజేఏవై) పథకానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వినోద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 70 ఏళ్లు, ఆపై వయసు ఉన్న వారి సామాజిక, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా పీఎంజేఏవై రూ.5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య రక్షణ లభిస్తుంది. దాదాపు 2 వేల రకాల వైద్య చికిత్సలను పొందవచ్చు. అర్హులైన వారు గూగుల్ ప్లేస్టోర్ ద్వారా ఆయుష్మాన్ యాప్ డౌన్ లోడు చేసుకుని నమోదు చేసుకోవాలి. https://beneficiary.nha.gov.in/ వెబ్‌సైట్, సచివాలయంలోని ఆరోగ్య కార్యదర్శి ద్వారా నమోదు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు 14555 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చు.

జేసీ ఆకస్మిక తనిఖీ

శెట్టూరు/కుందుర్పి: నిర్దేశిత గడువులోపు భూ రీ-సర్వే పనులు పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను జేసీ శివ్‌నారాయణ్‌శర్మ ఆదేశించారు. శెట్టూరు, కుందుర్పి మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. వీఆర్‌ఓల హాజరు, రోజు వారీ పనులపై ఆరా తీశారు. కొన్ని నెలలుగా సెలవుపై ఉన్న శెట్టూరు ఆర్ఐ గౌతమ్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన సెలవుపై వెళ్లిన విషయాన్ని కలెక్టర్ కార్యాలయానికి తెలపకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాడుబడిన వీఆర్‌ఓల గది చూసి నూతన గది నిర్మాణానికి ప్రతిపాదన సిద్ధం చేసి పంపాలని తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టిని ఆదేశించారు. కుందుర్పి రెవెన్యూ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించిన జేసీ... రైతుల నుంచి వివిధ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. 20 ఏళ్లుగా తాము సాగు చేస్తున్న భూములకు పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలంటూ వడ్డెపాళ్యం గ్రామానికి చెందిన పలువురు రైతులు కోరారు. కరిగానిపల్లిలో ప్రస్తుతం చేపట్టిన భూ రీ సర్వేపై తహసీల్దార్ శ్రీనివాసులుతో ఆరా తీశారు. కార్యాలయానికి పనిపై వచ్చే వారి సౌకర్యార్థం ఆవరణలో కుర్చీలు, బల్లలు ఏర్పాటు చేయాలని సూచించారు.

అంబేడ్కర్ గురుకులాల ప్రవేశ పరీక్ష వాయిదా

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ (అంబేడ్కర్) గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఏప్రిల్ 6న జరగాల్సిన రాత పరీక్ష వాయిదా పడింది. అనివార్య కారణాల వల్ల 13కు వాయిదా వేసినట్లు గురుకులాల ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి కె.జయలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని కోరారు. గంటముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. హాల్‌టికెట్లలో విద్యార్థుల ఫొటో తప్పుగా ప్రింట్ అయ్యి ఉంటే ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు/ఆధార్‌కార్డుతో పరీక్షకు హాజరుకావాలని తెలిపారు.

స్పెషల్ అసిస్టెంట్లు కావలెను!

- ఏప్రిల్ 3 నుంచి పది మూల్యాంకనం ప్రారంభం
- స్పెషల్ అసిస్టెంట్లుగా వచ్చేందుకు ఇప్పటి వరకూ ఆసక్తి చూపని ఉపాధ్యాయులు
- ఏటా ఇదే తంతు... గత అనుభవాలతో గుణపాఠం నేర్వని విద్యాశాఖ



మూల్యాంకనం చేస్తున్న టీచర్లు (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి జవాబు పత్రాలు మూల్యాంకన ప్రక్రియలో స్పెషల్ అసిస్టెంట్ల (ఎస్‌ఏ) పాత్ర చాలా కీలకం. మూల్యాంకనంలో ప్రతి ముగ్గురు ఏఈ (అసిస్టెంట్ ఎగ్జామినర్లు)లకు ఒక స్పెషల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) నియమించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సుమారు 300 మందికిపైగా స్పెషల్ అసిస్టెంట్లు అవసరం కాగా, ఇప్పటి వరకూ ఆ విధులు నిర్వర్తించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఏటా ఇదే తంతు కొనసాగుతూ వస్తున్నా... గత అనుభవాలతో విద్యాశాఖ అధికారులు గుణపాఠం నేర్చుకోక పోవడం గమనార్హం. ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి మూల్యాంకనం ప్రారంభం కానుంది. జిల్లాకు దాదాపు 2 లక్షలకు పైగా జవాబు పత్రాలు రానున్నాయి. ఇప్పటికే తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, గణితం పరీక్షల జవాబుపత్రాలు చేరాయి. అనంతపురంలోని కేఎస్‌ఆర్ బాలికల పాఠశాలలోని స్ట్రాంగ్ రూంలో వీటిని భద్రపరిచారు. వచ్చిన జవాబుపత్రాలను అధికారుల పర్యవేక్షణలో కోడింగ్ చేస్తున్నారు.

డీవైఈఓలు, ఎంఈఓలకు లేఖలు

స్పెషల్ అసిస్టెంట్ల విషయంలో ఈసారి కూడా గత ఏడాది పరిస్థితులే ఎదురయ్యాయి. ముందుగానే అప్రమత్తమవుతున్నామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఈ క్రమంలో ప్రతి మండలం నుంచి కనీసం 10 మంది టీచర్లను ఎంపిక చేసి స్పెషల్ అసిస్టెంట్ల విధులకు పంపాలని డిప్యూటీ విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మంత్రాంగం ఎంత మాత్రం పని చేస్తుందనేది మూల్యాంకనం ప్రారంభమైన తొలిరోజు తెలిసిపోతుంది.

సమస్యను అధిగమిస్తాం

ఏప్రిల్ 3 పదోతరగతి జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభమవుతుంది. స్పెషల్ అసిస్టెంట్లుగా వచ్చేందుకు ఉపాధ్యాయులు ఆసక్తి చూపక పోవడమనేది ప్రతి ఏటా వస్తున్న విషయమే. ఈసారి ఈ సమస్యను అధిగమిస్తాం. వీలైనంత మందిని నియమించేందుకు చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే డీవైఈఓలు, ఎంఈఓలకు లేఖలు రాశాం. ప్రతి మండలం నుంచి కనీసం పదిమంది టీచర్లను స్పెషల్ అసిస్టెంట్లుగా పంపాలని చెప్పాం.

– ప్రసాద్‌బాబు, డీఈఓ/గోవిందునాయక్, డిప్యూటీ క్యాంపు ఆఫీసరు

స్పెషల్ అసిస్టెంట్లు విధులు ఇలా..

మూల్యాంకనంలో చిన్నపాటి తప్పిదం జరిగినా నష్టోపోయేది విద్యార్థులే. అసిస్టెంట్ ఎగ్జామినర్లు (ఏఈ) పేపర్లు దిద్ది మార్కులు వేసిన తర్వాత ఆ జవాబు పత్రాన్ని స్పెషల్ అసిస్టెంట్లు తీసుకుని మార్కుల పోస్టింగులు, టోటలింగ్ పరిశీలించాల్సి ఉంటుంది. చిన్నపాటి తప్పిదాలకు తావివ్వకుండా ఏఈలు దిద్దిన జవాబు పత్రాలను స్పెషల్ అసిస్టెంట్లు మరోసారి పరిశీలించి మార్కుల వివరాలను ధ్రువీకరించాల్సి ఉంది. మూల్యాంకన ప్రక్రియలో పాల్గొంటున్న ఇతర అన్ని కేడర్ల కంటే స్పెషల్ అసిస్టెంట్లకే రెమ్యూనరేషన్ తక్కువ. పైగా డీఏ వెసులుబాటు ఉండదు. మండుతున్న ఎండలకు తోడు ఆశించిన స్థాయిలో రెమ్యూనరేషన్ ఇవ్వకపోవడంతో చాలామంది టీచర్లు స్పెషల్ అసిస్టెంట్లగా వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు.

రూ.4.30 లక్షల రికవరీకి ఆదేశాలు

పుట్లూరు: మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో 2023-24లో రూ.12కోట్లతో చేపట్టిన ఉపాధి పనుల్లో రూ.4.30లక్షల అవినీతి బయటపడింది. దీంతో రూ.4.30లక్షల రికవరీకి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. గత 10 రోజులుగా సామాజిక తనిఖీ బృందం సభ్యులు క్షేత్ర స్థాయిలో పనులు పరిశీలించి, కూలీల నుంచి స్వీకరించిన ఫిర్యాదులపై తుది నివేదిక సిద్ధం చేసి ప్రజా వేదికలో డ్వామా పీడీ సలీమ్‌బాషా, అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి ముందు వివరించారు. రూ.4.30 లక్షల అవినీతి జరగగా ఇందులో అత్యధికంగా బాలాపురం గ్రామ పంచాయతీ పరిధిలో రూ.2.18 లక్షల మేర అక్రమాలు చోటు చేసుకున్నట్లు వెల్లడించారు. ఇతర ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న వారిని, ఆశ వర్కర్లను, అంగన్‌వాడీ సిబ్బంది పేర్లను మస్టర్లలో చూపి ఉపాధి పనులు చేసినట్లుగా రికార్డులు సిద్ధం చేసి నిధులు స్వాహా చేసినట్లుగా నిర్ధారణ అయినట్లు తెలిపారు. దీంతో 21 గ్రామ పంచాయతీల్లో నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తించిన సిబ్బందికి రూ.42,500 జరిమానా విధించడంతో పాటు మరో రూ.1.98లక్షల విలువ గల పనులపై విచారణకు అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అలివేలమ్మ, విజిలెన్స్ అధికారి పర్వీష్, ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ, ఏపీడీ చెన్నకేశవులు, ఏపీఓ నరేంద్ర, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. కాగా, బాలాపురం గ్రామ పంచాయతీలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో వివాదం చోటు చేసుకోవడంతో పోలీసులు అప్రమత్తమై గురువారం ప్రజా వేదిక సందర్భంగా స్పెషల్ పార్టీ పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

హైకోర్టు వాఖ్యలు ప్రభుత్వానికి చెంపపెట్టు

- స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో పెచ్చుమీరిన కూటమి నేతల అరాచకాలు
- రైతుల సమస్యలు గాలికొదిలేసి బాబు పాలన
- వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు విశ్వేశ్వరరెడ్డి ధ్వజం



విలేకర్ల సమావేశంలో పాల్గొన్న విశ్వ, నాయకులు

ఉరవకొండ: చట్టాలను తుంగలో తొక్కి పోలీసులను పావులుగా వాడుకుంటూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా కూటమి సర్కార్ వ్యవహరిస్తున్న తీరుపై హైకోర్టు ధర్మాసనం చేసిన వాఖ్యలు ప్రభుత్వానికి చెంపపెట్టుగా మారాయని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు, పార్టీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో కలసి గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పరిస్థితులు ఎంత దుర్భరంగా ఉన్నాయో హైకోర్టు వాఖ్యలను బట్టి అర్థం చేసుకోవచ్చునన్నారు. పోలీసు వ్యవస్థను అడ్డు పెట్టుకుని కోర్టులను సైతం తప్పుదోవ పట్టించేలా సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకులే లక్ష్యంగా అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపుతుండడమే ఇందుకు నిదర్శనమన్నారు. రైతాంగ సమస్యలను గాలికొదిలేసి కూటమి ప్రభుత్వం అప్రజాస్వామ్యకంగా వ్యహరిస్తోందని మండిపడ్డారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన రైతుల జీవనానికి ఈ ప్రభుత్వం భరోసా కల్పించలేకపోతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేషన్, మండల ప్రజాపరిషత్ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకు 99 శాతం మెజార్టీ ఉన్నా తిరుపతి, తుని, వైజాగ్, రామగిరి, కంబదూరు తదితర ప్రాంతాల్లో ప్రతిపక్షం లేకుండా చేసేందుకు కూటమి నేతలు దౌర్జన్యాలు, దాడులకు తెగబడుతున్నారన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో పని చేస్తున్న సీఐ, ఎస్‌ఐలు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులను బెదిరిస్తూ పార్టీ ఫిరాయింపు చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ జర్నలిస్టులపై కూడా కూటమి నేతలు దాడులకు తెగబడుతున్నారన్నారు. నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటూ కూటమి నేతల దౌర్జన్యాలు, దాడులను సమర్థవంతంగా ఎదుర్కొంటామన్నారు.

ఉపాధి నిధులతో 5 రకాల అభివృద్ధి పనులు


- డ్వామా పీడీ సలీంబాషా

అనంతపురం టౌన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో 5 రకాల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా తెలిపారు. పశువులు నీరు తాగేందుకు నీటి తొట్టె, ఫారం పాండ్ల తవ్వకాలు, చెరువులు, పురాతన కోనేర్ల అభివృద్ధి, పూడికతీత పనులు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పశువుల నీటితొట్టెలు గ్రామానికి ఒకటి చొప్పున దాదాపు వెయ్యికి పైగా, 9,000 ఫారంపాండ్లు, మండలానికి మూడు చొప్పున మైనర్ ఇరిగేషన్ చెరువుల అభివృద్ధి, జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి చెరువులో పూడికతీత పనులు చేపట్టి వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పూర్తి చేస్తామన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: స్థానిక సుందరయ్యనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు ముద్దుకృష్ణ గురువారం తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆయనను కాపాడు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. కాగా, ఆయన ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రత్యామ్నాయంపై పరిశీలకుల బృందం



ఉలవ

అనంతపురం అగ్రికల్చర్: గత ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వేరుశనగ, కంది, పత్తి, ఆముదం, మొక్కజొన్న తదితర ప్రధాన పంటలు తక్కువ విస్తీర్ణంలో సాగులోకి రావడంతో గత సెప్టెంబర్‌లో ప్రత్యామ్నాయ విత్తనాల కింద జిల్లా రైతులకు ఉలవ, పెసర, అలసంద, కొర్ర తదితర వాటిని 80 శాతం రాయితీతో అందించారు. ఇందులో ప్రధానంగా మండలాల వారీగా ఎంత మంది రైతులు ప్రత్యామ్నాయం కింద ఉలవ విత్తనాలు తీసుకున్నారు, వారు విత్తనాలు సాగు చేశారా? పంటలను ఈ-క్రాప్‌లోకి నమోదు చేశారా? తదితర అంశాలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడానికి బృందాలు (వెరిఫికేషన్ టీమ్స్) ఏర్పాటు చేస్తూ వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకు ప్రత్యామ్నాయం కింద 27 వేల క్వింటాళ్ల విత్తనాలు కేటాయించగా... ఆలస్యంగా పంపిణీ మొదలు పెట్టడంతో 80 శాతం రాయితీతో 10 వేల క్వింటాళ్ల విత్తనాన్ని అందించారు. ఈ క్రమంలో అనంతపురం జిల్లాకు శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్లు (ఏడీ), అగ్రికల్చర్స్ ఆఫీసర్ల (ఏఓ)తో కూడిన 8 మందితో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. వీరు తమకు కేటాయించిన మండలాల్లో పర్యటించి డీ-కృషి యాప్‌లో విత్తన పంపిణీ డేటా ఆధారంగా రాండమ్‌గా 150 మంది రైతులను కలసి వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుంది. డీ-కృషి యాప్, ఈ-క్రాప్ డేటా క్రాస్ చెక్ చేసుకుని 10 ఫార్మాట్ల కింద సమగ్ర నివేదిక సమర్పించాలి. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలో పరిశీలనకు అనంతపురం జిల్లాకు చెందిన నలుగురు ఏడీఏలు, నలుగురు ఏఓలతో నాలుగు బృందాలు ఏర్పాటు చేశారు.

- అనంతపురం జిల్లాలో పరిశీలనకు ఏర్పాటు చేసిన మొదటి బృందంలో పెనుకొండ ఏడీఏ స్వయంప్రభ, హిందూపురం ఏఓ చైతన్యకు అనంతపురం, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, కూడేరు మండలాలు కేటాయించారు. అలాగే రెండో బృందంలో మడకశిర ఏడీఏ కృష్ణమీనన్, మడకశిర ఏఓ ఎలిజిబెత్‌కు కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాలు, మూడో బృందంలో కదిరి ఏడీఏ ఎస్.సత్యనారాయణ, కొత్త చెరువు ఏఓ ఎం.శ్రీవాణికి బెళుగుప్ప, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకలు, కణేకల్లు మండలాలు, నాలుగో బృందంలో ధర్మవరం ఏడీఏ జి.కృష్ణయ్య, ధర్మవరం ఏఓ మంజులతకు గుత్తి, శింగనమల, యాడికి, నార్పల, రాప్తాడు మండలాలు కేటాయించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నేతల దాడి



క్షతగాత్రులను ఆటోలో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో బుడగజంగాల కాలనీలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నేతలు విచక్షణారహితంగా దాడులకు తెగబడ్డారు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... ఈ నెల 11న కల్లూరు ఊరి దేవర నిర్వహించారు. ఆ సమయంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త విభూది జమ్మన్న ఇంటికి టీడీపీ నాయకులు ఫ్లెక్సీ కట్టారు. ఆ సమయంలో పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్న ఊరి దేవర కార్యక్రమం కావడంతో తన ఇంటికి కట్టిన ఫ్లెక్సీ తొలగించాలని సూచించాడు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చెలరేగింది. కులపెద్దలు జోక్యం చేసుకుని సర్ది చెప్పాడంతో అప్పటికి సమస్య సద్దుమణిగింది. ఈ అంశంపై ప్రతిష్టకు పోయిన టీడీపీ నేతలు రెండు రోజులు తర్వాత గుట్టు చప్పుడు కాకుండా వైఎస్సార్‌సీపీకి చెందిన అంజినేయులు, రామాంజినేయులు, చిన్నకుళ్లాయప్ప, జమ్మన్న, రాజుపై అక్రమంగా కేసు బనాయించారు. దీంతో గురువారం జిల్లా కోర్టులో వాయిదా చూసుకుని గార్లదిన్నె పీఎస్‌కు చేరుకున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషాను కలసి మాట్లాడారు. అనంతరం ఇంటికి వెళుతుండగా కల్లూరు రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే టీడీపీ నాయకులు దాడికి తెగబడ్డారు. అనంతరం కాలనీకి చేరుకుని ఇంటి వద్ద ఉన్న రామాంజనేయులు, వెంకటలక్ష్మి, శిరీషపై దాడి చేసి గాయపరిచారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గార్లదిన్నె పోలీసులు సర్వజనాస్పత్రికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు.

బాబోయ్.. దోపిడీ దొంగలు



ఆమిద్యాల పెట్రోలు బంకు వద్ద దొంగలు (సీసీ కెమెరా ఫుటేజీ)

ఉరవకొండ: నియోజకవర్గ పరిధిలోని వజ్రకరూరు, ఆమిద్యాల గ్రామాల్లో ఉన్న పెట్రోల్ బంక్‌ల్లో దోపిడీ దొంగలు స్వైరవిహారం చేశారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకూ కత్తులు, రాడ్లతో హల్‌చల్ చేశారు. ఆమిద్యాలలోని రంగమ్మ ఫిల్లింగ్ స్టేషన్ బంక్ వద్దకు బొలెరో వాహనంలో చేరుకున్న ఏడుగురు యువకులు ముఖానికి కర్చీఫ్‌లు కట్టుకుని అక్కడ నిద్రిస్తున్న సిబ్బందిని లేపి కత్తులు, రాడ్లతో బెదిరిస్తూ ఓ మూలన కూర్చొబెట్టారు. మేనేజర్ గదిలోకి చొరబడి రూర.2.80 లక్షలు అపహరించారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేసి హార్డ్ డిస్కులను ఎత్తుకెళ్లారు. అనంతరం వజ్రకరూరులోని శివశక్తి పెట్రోల్ బంకులోనూ సిబ్బందిని బెదిరించి రూ1.20 లక్షలను అపహరించారు. విషయం తెలుసుకున్న ఉరవకొండ రూరల్ సీఐ సయ్యద్ చిన్నగౌస్, అర్బన్ సీఐ మహనంది, ఎస్ఐ జనార్థన్‌నాయుడు, వజ్రకరూరు ఎస్ఐ నాగస్వామి, క్లూస్ టీం సభ్యులు అక్కడకు చేరుకుని నిందితుల వేలిముద్రలు సేకరించారు. సీసీ టీవీ పుటేజీల్లోని దృశ్యాలను స్వాధీనం చేసుకుని ఆమిద్యాల పెట్రోల్ బంకు మేనేజర్ పెద్దన్న, వజ్రకరూరు బంకు మేనేజర్ రామాంజినేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనుమానాలు నివృత్తి చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న పాస్టర్లు

గుత్తి: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గత మంగళవారం పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని పలువురు పాస్టర్లతో కలసి వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం గుత్తి నియోజకవర్గ అధ్యక్షుడు బింగి కిరణ్‌బాబు, పాస్టర్లు వాసు అనిల్‌కాంత్, అబ్రహాం, జాకోబ్ తదితరులతో కలసి గుత్తిలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. కొందరు ప్రభుత్వ పెద్దలు సైతం ప్రవీణ్ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు చిత్తశుద్ధి ఉంటే ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రాష్ట్రంలో క్రైస్తవులపై దాడులు అధికమయ్యాయన్నారు. సనాతన ధర్మమంటూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చెబుతూ క్రైస్తవులపై దాడులు ప్రోత్సహించడం, హత్యలకు ఉసిగొల్పడం సరికాదన్నారు. క్రైస్తవులు కూడా ఈ దేశంలో ఓ భాగమేనన్నారు. హిందువులు, ముస్లింలతో ఎన్నడూ క్రైస్తవులకు వైరం లేదన్నారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనుమానాలను నివృత్తి చేయకపోతే క్రైస్తవ సమాజాన్ని ఏకం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

'ఎస్ఐ సుధాకర్‌యాదవ్‌ను సస్పెండ్ చేయాలి'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు

అనంతపురం కార్పొరేషన్: శ్రీసత్యసాయి జిల్లా రామగిరి పీఎస్ ఎస్ఐ సుధాకర్‌యాదవ్‌ను సస్పెండ్ చేయాలంటూ వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని నాగన్న, సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా పోలీసులు వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. హైకోర్టు చీవాట్లు పెట్టినా వారి పనితీరులో మార్పు రావడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన న్యాయవాది నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు ఈ నెల 26న ఎంపీడీఓ కార్యాలయానికి వెళితే వారిపై దాడులకు తెగబడిన టీడీపీ గుండాలపై చర్యలు తీసుకోవాల్సిన ఎస్ఐ సుధాకర్‌యాదవ్ ఏకపక్షంగా వ్యవహరించడాన్ని ఆక్షేపించారు. సమావేశంలో లీగల్ సెల్ నగరాధ్యక్షుడు ఎస్ వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి ఐదేళ్ల జైలు

అనంతపురం: పోక్సో కేసులో ముద్దాయికి ఐదేళ్ల జైలు శిక్ష పడింది. వివరాలు.. యాడికి మండలంలోని ఓ గ్రామానికి చెందిన దాసరి సురేష్ 2021 సెప్టెంబర్ 19న తమ గ్రామానికే చెందిన బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ క్రమంలోనే ఆమె తండ్రి రావడంతో అర్ధనగ్నంగా పారిపోయాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అప్పట్లో యాడికి ఎస్ఐ రాంభూపాల్ కేసు నమోదు చేసి, అనంతపురం స్పెషల్ సెషన్స్ జడ్జి- పోక్సో కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. కేసులో ఏడుగురు సాక్షులను జడ్జి రాజ్యలక్ష్మి విచారించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి దాసరి సురేష్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా, బాధితురాలికి రూ.1.50 లక్షల పరిహారం చెల్లించాలంటూ గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరపున వాదనలను స్పెషల్ పీపీ ఈశ్వరమ్మ వినిపసించారు.

ఆకట్టుకున్న మెగా ఎడ్యుకేషన్ ఎక్స్‌పో







సంభ్రమ్ ఇనిస్టిట్యూట్ గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు, హెచ్‌ఏఎస్ ఏవియేషన్ అకాడమీ వివరిస్తున్న నిపుణులు, ఎస్ఈఏ(సీ) స్టాల్ వద్ద సందడి

అనంతపురం: నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న బీవీఆర్‌కే ఫంక్షన్ హాలు వేదికగా రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన మెగా ఎడ్యుకేషన్ ఎక్స్‌పో గురువారం ప్రారంభమైంది. తొలి రోజే విశేష స్పందన లభించింది. ఎడ్యుకేషన్ ఎక్స్‌పోలో అనేక విద్యా సంస్థలు ప్రాతినిధ్యం వహించాయి. బెంగళూరుకి చెందిన హిందూస్తాన్ ఏవియేషన్ అకాడమీ (మారతహళ్లి), సంభ్రమ్ ఇనిస్టిట్యూట్ (జాలహళ్లి ఈస్ట్), ఎస్ఈఏ(సీ) ఇంజినీరింగ్ కళాశాల (కృష్ణరాజపురం)ల్లో అందించే కోర్సులు, ఫీజులు, అడ్మిషన్ల ప్రక్రియ, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్, పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా అందించే కోర్సులు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రవేశపెట్టిన వినూత్న కోర్సులపై విద్యార్థులకు నిపుణులు అవగాహన కల్పించారు. ప్రత్యేక స్టాళ్లను విద్యార్థులు, తల్లిదండ్రులు పరిశీలించి .. కళాశాలల గురించి వివరాలు సేకరించారు. బెంగళూరులో చదవాలనుకునే విద్యార్థులకు ఇదొక చక్కని అవకాశమని పేర్కొన్నారు. కాగా, శుక్రవారంతో ఈ ఎక్స్‌పో ముగియనుంది.

క్లుప్తంగా

సత్యసాయి జయంతిని సెలవుగా ప్రకటించాలి

అనంతపురం టౌన్: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సెలవు దినంగా ప్రకటించి, జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఉమ్మడి అనంతపురం జిల్లా భట్రాజుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు అక్కిరాజు నాగరాజు, ప్రధాన కార్యదర్శి అబ్బరాజు వెంకటనారాయణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా బాబా జయంతి రోజు సెలవు ప్రకటిస్తే అన్ని జిల్లాల ప్రజలకు బాబా జయంతి వేడుకల గురించి తెలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించాలని కోరారు.

క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ రాజ్యాంగ విరుద్ధం

అనంతపురం అర్బన్: దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికముక్క సుబ్బయ్య అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ మలోలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1950 రాష్ట్రపతి ప్రకటన మూడవ క్లాజ్ వివరణలో హిందూమతంలో వివిధ కులాలకు చెందిన వారు శతాబ్దాలుగా సామాజిక వివక్ష, అంటరానితనం, అవమానాలకు గురైన వారు ఎస్సీలుగా పరిగణించబడతారని స్పష్టంగా ఉందన్నారు. దళిత క్రైస్తవులను షెడ్యూల్ కులాల్లో చేరిస్తే దళిత హిందూ దళిత సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. అందువల్ల మతం మార్చుకున్న వారిని ఎస్సీ కుల జాబితా నుంచి తొలగించి నిజమైన ఎస్సీ కూలాల వారికే ప్రయోజనాలు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్యక్రమంలో వేదిక జిల్లా అధ్యక్షుడు కుమ్మలూరు వీరప్రకాష్, ప్రధాన కార్యదర్శి కొండమల్లెల నాగేంద్ర, నాయకులు కేపీ పెద్దయ్య, నేనాటి నాగేశ్వరరెడ్డి, నాగప్ప, శివప్రసాద్, కృష్ణప్ప, కుమ్మగొండ రాజు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి నిజాయితీ

- దొరికిన నగదు పోలీసులకు అందజేత



నగదును వన్‌టౌన్ సీఐ రాజేంద్ర నాథ్ యాదవ్‌కు అందజేస్తున్న గోపీనాథ్ కుటుంబ సభ్యులు

అనంతపురం: నగరంలోని ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద గురువారం రూ.2 లక్షల నగదును ఎవరో పోగొట్టుకున్నారు. అదే సమయంలో బ్యాంకుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గోపీనాథ్ కుటుంబ సభ్యులు మంజునాథ్ యాదవ్, మురళి, భారతి, లక్ష్మీదేవికి నగదు దొరికింది. దొరికిన రూ.2 లక్షల డబ్బును వెంటనే వన్‌టౌన్ సీఐ వి.రాజేంద్రనాథ్ యాదవ్‌కు అందజేశారు. నిజాయితీగా నగదును పోలీసులకు అప్పగించడం అభినందనీయమని సీఐ ప్రశంసించారు.

ఆహారనాళంలో ఇరుక్కున్న మామిడి కాయ

- చాకచక్యంగా తొలగించిన డాక్టర్ పద్మనాభం బృందం

అనంతపురం అగ్రికల్చర్: ఆవు ఆహారనాళంలో ఇరుక్కుపోయిన మామిడి కాయను పశు సంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ బృందం గంట పాటు శ్రమించి చాకచక్యంగా తొలగించారు. వివరాలు.. రాప్తాడుకు చెందిన జి.కృష్ణయ్య పాడి ఆవు మామిడి కాయలు తింటూ పొరపాటున ఒక కాయను మింగడంతో అది ఆహారనాళంలో ఇరుక్కుపోయింది. అప్రమత్తమైన రైతు వెంటనే పశుశాఖ డాక్టర్‌ను సంప్రదించారు. పరిస్థితి ఇబ్బందిగా ఉండటంతో పశుశాఖ శింగనమల ఏడీ డాక్టర్ పద్మనాభం దృష్టికి తీసుకెళ్లారు. ఆవును స్థానిక సాయినగర్ పశువుల ఆస్పత్రికి తరలించారు. మౌత్‌గ్యాంగ్ సాయంతో ఆవు నోటిని బాగా తెరిచి ఉంచి అందులో చేయిపెట్టి ఆహారనాళం మొదటి భాగంలో అడ్డుపడిన మామిడి కాయను బయటకు తీసేశారు. ఉదయం నుంచి మింగలేక, కక్కలేక, నీళ్లు, మేత లేక తీవ్రంగా ఇబ్బంది పడిన పాడి ఆవు మామిడికాయను తొలగించిన తర్వాత మేత తీసుకోవడం మొదలు పెట్టింది. డాక్టర్ పద్మనాభం, వెటర్నరీ అసిస్టెంట్స్ రాఘవ, కమలాకర్ బృందానికి రైతు క్రిష్ణయ్య కృతజ్ఞతలు తెలిపారు. మామిడి కాయల సీజన్ కావడంతో మూగజీవాలు ఇబ్బంది పడకుండా రైతులు, జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ పద్మనాభం సూచించారు.

నేటి నుంచి ముసలమ్మ ఆలయ వార్షికోత్సవం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి పక్కన నిర్మించిన ముసలమ్మ ఆలయ 5వ వార్షికోత్సవం శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త సుశీల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 28న ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు మూల దేవతా ప్రార్థన, గురు ప్రార్థన, గణపతి పూజ, స్వస్తి వాచనము, రక్షా బంధనం, నిర్వహించనున్నారు. 29న అభిషేకం, కలశ స్థాపన గణపతి హోమం, పంచామృతాభిషేకం, కలశ స్థాపన ఆదిత్యా నవగ్రహ హోమం, విగ్రహం ఊరేగింపు, 30న తెప్పోత్సవం నిర్వహించనున్నారు.

కోర్కెలు నెరవేర్చే అక్కదేవతలు



ఒంటికొండ గ్రామంలోని అక్కదేవతల మూల విరాట్



మేడాపురంలో లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం



అలంకరణలో లక్ష్మీనరసింహుడు

- నేటి నుంచి 31వ తేదీ వరకూ ఉత్సవాలు
- ఒంటికొండ గ్రామంలో ఏర్పాట్లు పూర్తి
- పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులు

చెన్నేకొత్తపల్లి: భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అక్కదేవతల ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండల పరిధిలోని వెంకటంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఒంటికొండ గ్రామంలో ఏటా ఉగాది పండుగను పురస్కరించుకుని అక్కదేవతల ఉత్సవాలను నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఈనెల 28వ తేదీన ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. 31వ తేదీ వరకూ ఉత్సవాలు జరగనున్నాయి. 28న ఒంటికొండ నుంచి పూజారితో పాటు మరికొందరు భక్తులు పాదయాత్రగా కొత్తచెరువు మండలం లింగారెడ్డిపల్లికి వెళ్తారు. అక్కడి నుంచి ఎలవగంప తీసుకొస్తారు. మరుసటి రోజు ఒంటికొండ నుంచి గిరిగిలు (దేవత ప్రతిమలు) ఆభరణాలను కొత్తచెరువు మండలం కొడపగానపల్లికి తీసుకెళ్లి అక్కడ వాటిని అలంకరిస్తారు. తిరిగి ఎలవ గంపను తలపై ఉంచుకుని పాదయాత్రగా ఒంటికొండ గ్రామానికి ఉగాది పండుగ రోజు ఉదయానికి చేరుకుంటారు. గ్రామంలో అక్కదేవతలతో పాటు నరసింహస్వామి, చెన్నుడు దేవతలను మేళతాళాలతో ఊరేగిస్తారు. భక్తులు తమ కోర్కెలు నెరవేరాలని స్వామి ముందు మొకరిల్లి వేడుకుంటారు. ఇలా చేయడం వల్ల కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. 31వ తేదీన గ్రామంలో ఆడపిల్లలకు అక్కదేవతల కొలనులో స్నానాలు చేయిస్తారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం నుంచి భక్తులు కుంకాలు వేసుకుంటారు. ఈ ఉత్సవాలను చుటుపక్కల గ్రామాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివస్తారు. ఉత్సవాల ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకూ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తారు.

రేపటి నుంచి మేడాపురంలో..

- లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలకు సర్వం సిద్ధం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని మేడాపురం గ్రామంలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు ఈనెల 29వ తేదీన (శనివారం) ప్రారంభవుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా ఉగాది పండుగను పురస్కరించుకుని స్వామివారి ఉత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శనివారం ఉదయం నుంచి దేవాలయంలో స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేస్తారు. సాయంత్రం గ్రామ సమీపంలోని గుట్టలో ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ప్రతిమలను (గిరిగెలు) తీసుకొస్తారు. వాటిని అత్యంత భక్తిశ్రద్ధలతో తెల్లటి నూతన వస్త్రంలో చుట్టుకుని గ్రామానికి ఊరేగింపుగా తీసుకొస్తారు. అనంతరం స్వామి ప్రతిమలకు వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య రాభరణాలను అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఉత్సవ ప్రతిమలను గ్రామంలో మేళతాళాలతో ఊరేగిస్తారు. భక్తులు స్వామి వారి ముందు కోర్కెలు నెరవేర్చాలని మొకరిల్లుతారు. స్వామి వారి ఊరేగింపులో కోలాటం, భక్తిగీతాల ఆలాపన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. గోవింద నామస్మరణతో గ్రామం మార్మోగుతుంది. ఉదయానికి స్వామిని ఊరేగింపుగా దేవాలయానికి చేరుస్తారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అన్నదానం చేస్తారు. ఈ ఉత్సవాలకు పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామికి ఫల, పుష్పాలను సమర్పించి పూజలు చేయిస్తారు.

'ఇఫ్తార్ విందును బహిష్కరించండి'

- మేయర్ వసీం పిలుపు



అనంతపురం కార్పొరేషన్: ముస్లిం మైనార్టీల మనోభావాలు దెబ్బతీసిన కేంద్రంతో అంటగాగుతూ.. ముస్లింలపై కపట ప్రేమ చూపిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని నమ్మవద్దు. శుక్రవారం అనంతపురంలో నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందును ముస్లింలు బహిష్కరించాలని మేయర్ వసీం పిలుపునిచ్చారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీ మత పెద్దలు ఇచ్చిన పిలుపు మేరకు ముస్లిం మైనార్టీలెవ్వరూ ఇఫ్తార్‌లో పాల్గొనవద్దన్నారు. పార్లమెంట్‌లో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న వక్ఫ్ సవరణ బిల్లును సంబంధించి అన్ని పార్టీలు వ్యతిరేకించాలన్నారు. కూటమి ప్రభుత్వం బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసి, ముస్లింలపై ఏ పాటి చిత్తశుద్ధి ఉందో నిరూపించుకోవాలని సూచించారు. పార్లమెంట్‌లో సంఖ్యా బలంలో కేంద్రానికి మద్దతుగా నిలవడంలో టీడీపీ ఎంపీలు కీలకంగా ఉన్నారని.. బిల్లుకు వ్యతిరేకంగా నిలబడితే కేంద్రం దిగివస్తుందన్నారు. ఆ దిశగా సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటారో లేదో చూడాలన్నారు. దివంగత వైఎస్సార్ కుటుంబంతోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి సాధ్యపడిందన్నారు. మహానేత వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చి మైనార్టీలు అన్ని విధాల అభివృద్ధి సాధించేందుకు కృషి చేశారన్నారు.

క్యాబ్‌ను ఢీ కొన్న కారు

- నలుగురు ఉపాధ్యాయులకు తీవ్రగాయాలు
- మరో ఆరుగురికి స్వల్ప గాయాలు




తీవ్రంగా గాయపడిన ఆనందరెడ్డి, పి.ఉమాదేవి

బత్తలపల్లి: స్థానిక జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో నలుగురు ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు తెలిపిన మేరకు.. బత్తలపల్లి మండలం నల్లబోయనపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులు సమీపంలోని అనంతపురం నగరంలో నివాసముంటూ రోజూ విధులకు వచ్చి వెళుతుంటారు. ఈ క్రమంలో సమయానికి పాఠశాలకు చేరుకునేందుకు వీలుగా ఓ ప్రైవేట్ క్యాబ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. గురువారం విధులకు హాజరైన ఉపాధ్యాయులు సాయంత్రం పాఠశాల వేళలు ముగిసిన తర్వాత క్యాబ్‌లో అనంతపురానికి తిరుగు ప్రయాణమయ్యారు. చిత్రావతి నది బ్రిడ్జి దాటిన తర్వాత ఉప్పర్లపల్లి క్రాస్ వద్దకు చేరుకోగానే ముదిగుబ్బ వైపు నుంచి వేగంగా వస్తున్న కారు వెనుక నుంచి క్యాబ్‌ను ఢీ కొంది. దీంతో క్యాబ్ అదుపు తప్పి డివైడర్ ఎక్కి బోల్తాపడింది. ఘటనలో ఉపాధ్యాయులు ఆనందరెడ్డి, బిల్లే ఉమాదేవి, పి.ఉమాదేవి, పార్వతమ్మకు తీవ్రగాయాలయ్యాయి. రామచంద్ర, మహబూబ్‌బాషా, చాంద్‌బాషా, విశాల, అనురాధ, రికార్డు అసిస్టెంట్ పార్వతమ్మ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 వాహనంలో బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ప్రమాద విషయం తెలుసుకున్న ఎంఈఓలు చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్, నల్లబోయనపల్లి హెచ్‌ఎం ప్రహ్లాదనాయుడు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ మాజీ చైర్మన్ హరినాథరెడ్డి, నాగేశ్వరరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, ఓబిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంజీవరెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, నాగేశ్వరయ్య, అనిల్‌చౌదరి, నాగరాజు, ముదిగుబ్బ మండల నాయకులు సి.రామకృష్ణారెడ్డి, చంద్రమోహన్, చిట్టిబాల ఓబిరెడ్డి, ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. ఫోన్ ద్వారా క్షతగాత్రులతో డీఈఓ కిష్టప్ప మాట్లాడారు. వారికి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓలను ఆదేశించారు.

'ఏపీ సూపర్ కప్' విజేత గోదావరి క్లబ్



గోదావరి క్లబ్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కోటగిరి శ్రీధర్

అనంతపురం: రాష్ట్రంలో తొలిసారిగా అనంతపురంలోని ఆర్డీటీ క్రీడాగ్రామం వేదికగా నిర్వహించిన ఏపీ సూపర్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా గోదావరి క్లబ్ జట్టు నిలిచింది. గురువారం కొల్లేరు– గోదావరి క్లబ్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. 2–1 గోల్స్ తేడాతో గోదావరి క్లబ్ జట్టు విజయకేతనం ఎగురవేసింది. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోటగిరి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై విజేత జట్టుకు ట్రోఫీతో పాటు రూ.5 లక్షల నగదు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డేనియల్ ప్రదీప్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలను మోసం చేస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న సాకే హరి

అనంతపురం రూరల్: ఎస్సీ, ఎస్టీలను కూటమి ప్రభుత్వం నిలువునా మోసం చేస్తుందని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు. గురువారం దామోదర సంజీవయ్య భవన్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎస్సీ, ఎస్టీలకు అనేక హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు అధికారం చేపట్టి 9 నెలలు కావస్తున్న ఎస్సీ, ఎస్టీలకు ఒక్క సంక్షేమ పథకం అందించకుండా నిలువునా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీలను ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తిగా విస్మరించారన్నారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందించి ఆయా వర్గాలకు అండగా ఉంటామన్న గొప్పలు చెప్పిన ప్రభుత్వం నేటికి ఆదిశగా అడుగులు వేయలేదన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సబ్సిడీ రుణాలు అందించడంతో పాటు, భూమి కొనుగోలు పథకం ద్వారా భూమి లేని దళిత, గిరిజనులకు ఒక్కొక్కరికి 3 ఎకరాల భూమి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలను ప్రభుత్వం విస్మరిస్తే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యులు చిరంజీవి, నాయకులు శ్రీనివాసులు, రామకృష్ణ, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వానికి ప్రతీక రంజాన్



రంజాన్ తోఫా అందజేస్తున్న మేయర్ వసీం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న డిప్యూటీ మేయర్ కోగటం తదితరులు



పేదలకు రంజాన్ తోఫా అందజేస్తున్న డాక్టర్ అక్తర్ సాహెబ్

అనంతపురం కార్పొరేషన్/అనంతపురం మెడికల్: దాతృత్వానికి ప్రతీక రంజాన్ అని మేయర్ వసీం పేర్కొన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని నగరంలోని 42వ డివిజన్‌లో కార్పొరేటర్ రహంతుల్లా, 43వ డివిజన్‌లో సయ్యద్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో మేయర్ వసీం ముస్లిం, మైనార్టీలకు తోఫా అందజేశారు. పేదలు కూడా సంతోషంగా పండుగ జరుపుకోవాలన్న ఉద్దేశంతో రంజాన్ తోఫా అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, కార్పొరేటర్లు కమల్ భూషణ్, ఇసాక్, తదితరులు పాల్గొన్నారు. సాయినగర్‌లోని డాక్టర్ అక్బర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణలో గురువారం పేద ప్రజలకు రంజాన్ తోఫా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అక్బర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు ఏర్పాటు అభినందనీయం

అనంతపురం కల్చరల్: రంజాన్ మాసంలో ముస్లింల ఉపవాసాలను గౌరవిస్తూ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం అభినందనీయమని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం అరవిందనగర్‌లోని మసీదులో సాయిట్రస్టు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. సాయిట్రస్టు వారు అన్ని పండుగలను సమానంగా గౌరవిస్తూ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్, వెంకటేష్, నారాయణ నాయక్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు పండుగ కానుక

అనంతపురం కల్చరల్: నగరంలోని ఆదరణ సేవా సమాజ్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమంలో వృద్ధులు, నిరాశ్రయులు, అనాథలకు సందీప్ కుమార్, శ్రీలత, శ్రీనాథ్ తదితరులు గురువారం నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకుడు లాల్‌బాషా, ఉపాధ్యక్షురాలు ముంతాజ్, సెక్రటరీ ఫక్రుద్దీన్ తదతరులు పాల్గొన్నారు. అలాగే రైన్‌బో అనాథాశ్రమంలోని 50 మంది చిన్నారులకు సీఆర్‌డీఎస్ డైరెక్టర్ సద్దాం బాషా, సువర్ణ, విష్ణుప్రియ తదితరులు నూతన వస్త్రాలు, ఇతర కానుకలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో సతామి వేడుకలు



విద్యుత్ దీపాల అలంకరణలో బావొద్దీన్ మసీదు



నమాజ్ చేస్తున్న ముస్లింలు

అనంతపురం కల్చరల్: రంజాన్ మాసంలో వచ్చే పవిత్ర దినమైన లైలతుల్ ఖద్ర్ (సతామి) పర్వదినాన్ని ముస్లింలు జాగరణ చేస్తూ భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గురువారం ఉదయం ఫజర్ నమాజ్ నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేసి సాయంత్రం ఇఫ్తార్ వరకూ ఖురాన్ సూరాలను ఆలపించారు. నగరంలోని జామియా మసీదు, బావుద్దీన్ మసీదు, చాందినీ, జంగాలపల్లి మసీదు, ఈద్గా, నూరానీ మసీదులు విద్యుద్దీప కాంతుల్లో మెరిసిపోయాయి. పెద్ద ఎత్తున ముస్లింలు సామూహిక ప్రార్థనలకు తరలివచ్చారు. తరావీ నమాజ్ అనంతరం రాత్రంతా మసీదుల్లో జాగరణతో పవిత్ర ఖురాన్ పఠనం సాగింది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన మతపెద్దలు రంజాన్, సతామీ విశిష్టతను వివరించారు. అల్లాహ్ అనుగ్రహంతో పవిత్ర ఖురాన్ ఆవిర్భవించిన రోజుగా లైల తుల్ ఖద్ర్‌ను జరుపుకుంటామని తెలిపారు.

ఒక్క పోస్టుకు 16 మంది పోటీ



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీఓ, ఐసీడీఎస్ అధికారులు

అనంతపురం సెంట్రల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం నగరంలో ఎర్రనేల కొట్టాల అంగన్‌వాడీ వర్కర్ పోస్టుకు రీ ఇంటర్వ్యూలు నిర్వహించారు. గతంలో రాజకీయ వివాదం రేగడంతో నియామకం జరగలేదు. దీంతో మళ్లీ రీ ఇంటర్వ్యూలు నిర్వహించారు. అప్పట్లో 20 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. రీ ఇంటర్వ్యూలకు 16 మంది హాజరయ్యారు. ఆర్డీఓ కేశవ నాయుడు, ఐసీడీఎస్ పీడీ నాగమణి, సీడీపీఓ లలిత తదితరులు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. అర్హత ఉన్న అభ్యర్థికి త్వరలో నియామక ఉత్తర్వులు అందజేస్తామని అధికారులు తెలిపారు.

కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం



ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసిన కళాకారులు

అనంతపురం కల్చరల్: కళాకారుల ప్రతిభాపాటవాలను గుర్తించి ఆదరించాలని లలిత కళాపరిషత్తు కార్యదర్శి పద్మజ అన్నారు. గురువారం ఎల్కేపీలో ప్రపంచ రంగస్థల దినోత్సవం జరుపుకున్నారు. లలిత కళాపరిషత్తు సీనియర్ కళాకారులు సంగాల నారాయణ స్వామి, రామగోవింద సాగర్, సోమిరెడ్డి, కుల్లాయప్ప తదితరులు మాట్లాడారు. అనంత రంగస్థలానికి ఎంతో మంది దిగ్గజ కళాకారులు తమదైన అభినయంతో ఎనలేని సేవలందించారని గుర్తు చేసుకున్నారు. దివంగత నారాయణ స్వామి ఏకంగా ఐదు బంగారు నంది నాటక అవార్డులు సాధించడం అందరిలో స్ఫూర్తినింపిందన్నారు. ఔత్సాహిక కళాకారులకు లలిత కళాపరిషత్తు ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. అంతకుముందు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాకారులు ఆలపించిన పద్యాలు ఆకట్టుకున్నాయి.

గిరిజనుల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ అనిత

అనంతపురం: గిరిజనుల ఆర్థిక స్వావలంబన, విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా పరిశోధనలు కొనసాగాలని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని 'సెంటర్ ఫర్ సోషల్ ఇంక్లూజన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. దేశంలో గిరిజనులు 8.6 శాతం ఉన్నారన్నారు. ఇప్పటికీ సరైన సదుపాయాలు లేక ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి సదస్సులతో గిరిజన తెగల గురించి వాళ్లలో సామాజిక ఆర్థిక పరివర్తన అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.కృష్ణకుమారి మాట్లాడుతూ.. ఈ జాతీయ స్థాయి సదస్సులో 120 మంది పేపర్ ప్రజెంటేషన్ ఇస్తారని వెల్లడించారు. అంతకు ముందు వీసీ చేతుల మీదుగా రెండు వాల్యూమ్స్ (స్టడీ సెంటర్ క్షేత్రస్థాయి పర్యటన వివరాలతో కూడిన గ్రంథం) ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ రమేష్ బాబు, విశ్రాంత ప్రొఫెసర్ ఎండీ బావయ్య ప్రసంగించారు. కార్యక్రమంలో సోషల్ ఇంక్లూజన్ అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ కే. వెంకటరెడ్డి, డాక్టర్ డి. శ్రీనివాస రావు, సిబ్బంది టి. కృష్ణారెడ్డి, ప్రశాంత్, డాక్టర్ కొండారెడ్డి, పద్మావతి, నర్మద, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల చట్టం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా అడిషనల్ ఎస్పీ డీవీ రమణ మూర్తి

అనంతపురం: దివ్యాంగుల హక్కుల చట్టం–2016 తెలుగు అనువాద పుస్తకాన్ని జిల్లా అడిషనల్ ఎస్పీ డీవీ రమణ మూర్తి, డీఎస్పీ వి.శ్రీనివాస రావు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. దివ్యాంగుల హక్కుల చట్టంపై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఇటుకలపల్లి ఎస్ఐ, కూడేరు సీఐ, కళ్యాణదుర్గం సీఐపై చర్యలు తీసుకోవాలని ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు ఫిర్యాదు చేశారు. దివ్యాంగ బాధితులపై ప్రవర్తిస్తున్న తీరు సరిగా లేదని, వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షఫీ, జిల్లా అధ్యక్షుడు సాకే ఆంజనేయులు, ఉమ్మడి జిల్లా కో–ఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సర్ఫున్నిసా, లీగల్ అడ్వైజర్ జన్నే ఆనంద్, రసూల్, ఎమ్మార్పీఎస్ నాయకులు లక్ష్మన్న, సుధాకర్ పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
అనంతపురం
శుక్రవారం ॥ 28-3-2025

పేరెంటింగ్

ఐఏఎస్ అధికారిణి, ఇద్దరు పిల్లల తల్లి అయిన దివ్య మిట్టల్ ఇటీవల సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేసింది.
'నేను ఒక ఐఏఎస్ అధికారిణి ని.
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఢిల్లీలో,
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎమ్) బెంగళూరులో చదివాను.
వీటిని సాధించడానికి చాలా కష్టపడ్డాను.
కానీ, నా ఇద్దరు చిన్నారి కూతుళ్లను పెంచే క్రమంలో
సవాళ్లను ఎదుర్కోవడానికి ఏదీ నన్ను సిద్ధం చేయలేదు..'
అంటూ ఆ పోస్ట్‌లో పేర్కొంది.
ఇటీవల కాలంలో ఉద్యోగం చేసే అమ్మల శాతం పెరుగుతోంది.
అదే సమయంలో పిల్లల పెంపకం పట్ల సరైన జాగ్రత్తలు
తీసుకుంటున్నామా అనే ఆందోళనా పెరుగుతోంది.
కాలానికి అనుగుణంగా వస్తున్న మార్పులను
నేటి తల్లులు ఎలా సమతుల్యతను సాధించాలో నిపుణులు సూచిస్తున్నారు.



ఆఫీసులో అమ్మ... ఇంట్లో బిడ్డ

వయస్సుతో సంబంధం లేకుండా కష్టాల్లో ఉన్నప్పుడు మనం 'అమ్మా' అని పిలుస్తాం.

ఈ పిలుపు తల్లీ బిడ్డ జీవితాంతం పంచుకునే అనుబంధానికి స్పష్టమైన సూచన. ప్రాచీన కాలం నుండి సమాజంలో మహిళలు పిల్లల సంరక్షకులుగా పరిగణించబడ్డారు. వారి విధి ఇంటికి, ఇంట్లోని వారిని జాగ్రత్తగా చూసుకోవడానికి మాత్రమే పరిమితమయ్యింది. దీంతో తల్లులు ఎప్పుడూ ఇంట్లోనే ఉండాలనే ఈ భావన పిల్లలను వారి జీవితాల్లో, అభివృద్ధిలో సురక్షితంగా ఉంచింది. నేడు సమాజంలో తల్లులు ఇంటి పనుల నిర్వహణలోనూ, పిల్లల సంరక్షణలోనూ రెండు పాత్రలను పోషిస్తున్నారు. పిల్లల సంరక్షణలో తండ్రుల వాటా పెరిగినప్పటికీ మహిళలు ఇప్పటికీ వారి ఇంట్లో మొదటి సంరక్షకులుగా ఉంటున్నారు.

విజయవంతమైన మార్పు

ప్రపంచవ్యాప్తంగా వర్కింగ్ ఉమెన్ గురించి చేసిన అధ్యయనాల్లో దాదాపు 73 శాతం మంది మహిళలు 30 ఏళ్ల వయసులో తమ పిల్లలను చూసుకోవడానికి తమ ఉద్యోగాలను విడిచిపెట్టారని, 27 శాతం మంది కొంతకాలం తర్వాత తిరిగి వచ్చారని గమనించారు. వారిలో దాదాపు 16 శాతం మంది తమ వృత్తిపరమైన పని జీవితంలో అధికారులుగా ఉన్నారు. కాబట్టి తల్లులుగా ఉన్న మహిళలు వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను విజయవంతంగా మార్చుకుంటున్నారని కూడా స్పష్టమైంది. 'ఉద్యోగినిగా డబ్బు సంపాదిస్తూ పిల్లలకు కావల్సినవి సమకూర్చగలుగుతున్నాను. కానీ, వారిని సక్రమంగా పెంచగలుగుతున్నానా..' అనుకునే తల్లులకు సాంకేతికత వరంగా మారింది. సమయానుకూలంగా వర్క్ ఫ్రమ్ హోమ్‌ను ఎంచుకోవచ్చు.

సానుకూల ప్రభావాలు

- ఉద్యోగ తల్లిదండ్రులిద్దరూ ఇంట్లో రెండు పని చక్రాలతో తమ జీవితాలు సజావుగా నడుస్తున్నట్టు చూస్తారు. ఉన్నత విద్యను పొందగల సామర్థ్యం, భౌతిక, సౌకర్యవంతమైన జీవితాన్ని గడపగల సామర్థ్యం కారణంగా వారు మరింత సంతృప్తికరమైన జీవితాలను గడుపుతారు. ఇప్పుడు ఉద్యోగాల్లోకి వెళ్లే మహిళలు ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, కెరీర్ అవకాశాలను సరైన ప్యాకేజీలతో అందుకుంటున్నారు.
- హార్వర్డ్ బిజినెస్ స్కూల్ అధ్యయనం ప్రకారం పనిచేసే తల్లుల కుమార్తెలు వారి తల్లులకంటే 23శాతం ఎక్కువ సంపాదిస్తారని తెలిసింది. మరోవైపు పనిచేసే తల్లుల కుమారులు బాధ్యతాయుతమైన పెద్దలుగా ఎదుగుతారు. వారి ఆఫీసుల్లో లింగ సమానత్వాన్ని ఇష్టపడతారు. మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లను గౌరవిస్తారు. వారు భవిష్యత్తులో తమ కుమార్తెలకు అద్భుతమైన తండ్రులుగా కూడా పెరుగుతారు.
- తమ తల్లి జీవితంలోని దుఃఖకరమైన రోజులనూ చూసి ఉంటారు. అంతేకాదు తమ తల్లి పట్టుదల, దృఢ సంకల్పం వారు మానసికంగా, ఆర్థికంగా తమ సామర్థ్యాల మేరకు తమను తాము ముందుకు తీసుకెళ్లేలా చేస్తాయి. అన్నింటికంటే వారు హీరోలలో తమ తల్లిని ఒక షీ–రో గా చూస్తారు.

హద్దులు అవసరం

పని, కుటుంబంతో పాటు వ్యక్తిగత అవసరాలకూ ప్రాముఖ్యం ఇవ్వండి. శారీరక, భావోద్వేగ శ్రేయస్సు కోసం స్వీయ సంరక్షణ అవసరం అనేది గుర్తుంచుకోవాలి. రోజులో పిల్లలకోసమే అన్నట్టుగా కొంత సమయం గడపండి. ఆ సమయంలో ఏదైనా పని నైపుణ్యాలు నేర్పించాలా, చదువు పట్ల దృష్టి పెట్టాలా, ఆనందంగా ఉంచడానికి ప్రాధాన్యత ఇవ్వాలా.. ఇలా దేనికది బేరీజు వేసుకోవాలి. సహాయకులుగా ఉండేవారి మద్దతు ఎలా అందుతుందో చెక్ చేసుకోండి. వృత్తిపరమైన వృద్ధికి, తల్లి పాత్రకు విలువనిచ్చేవారిని సహాయకులుగా ఉండేలా చూసుకోండి. ప్రతి ఒక్కరూ జవాబుదారీతనం తీసుకునే కుటుంబ వాతావరణాన్ని సృష్టించండి. ప్రతి ఒక్కరూ పనులు చేసేలా, బాధ్యత తీసుకునే కుటుంబ వాతావరణాన్ని సృష్టించండి.

– ప్రొ. పి.జ్యోతిరాజ, సైకాలజిస్ట్, లైఫ్ స్కిల్ నిపుణులు



మెరుగైన సమయ నిర్వహణ

- పనిచేసే తల్లులు ప్రతిరోజూ తమ పిల్లలతో కనీసం ఒకటి లేదా రెండు గంటలు గడపగలిగేలా సమయాన్ని ప్లాన్‌చేసుకోవాలి. ఇది ఒక దినచర్యగా అనుసరించాలి. వేర్వేరు పనులను షెడ్యూల్ చేయడం, వాటిని సమయానికి పూర్తి చేయడం అనే మీ అలవాటు మీ పిల్లలు అదే అడుగు జాడల్లో నడవడానికి ఒక ఉదాహరణగా ఉపయోగపడుతుంది.
- పిల్లలు టైమ్‌టేబుల్‌కు కట్టుబడి ఉండటానికి కూడా ప్రోత్సహిస్తుంది. పిల్లలు మీ పనిని పూర్తి చేయడంలో సహకరిస్తున్నందుకు మీకు సంతోషాన్ని కలిగిస్తుంది.
- కాలక్రమంలో పిల్లల సమయ నిర్వహణ నైపుణ్యాలు మెరుగుపడతాయి. ఇది వారి మెరుగైన జీవితానికి సహాయపడుతుంది. అంతేకాదు, పిల్లలతో మరింత నాణ్యమైన సమయాన్ని గడపడానికి సహాయపడుతుంది.



దివ్య మిట్టల్

అమ్మా, నువ్వే నా హీరో..


నా పెద్ద కూతురికి 8 ఏళ్లు. ప్రపంచం గురించి ఇప్పటికే భిన్నమైన ఆలోచనలను చేస్తుంటుంది. ఎదిగే క్రమంలో ఆమె ఆలోచనల కాంతిని మసకబారనివ్వం. కొన్నిసార్లు పని ఒత్తిడిలో చాలా అలసిపోయినట్టుగా ఉంటుంది. ఆ అలసటలో ఏడుపు వచ్చేస్తుంటుంది కూడా. అలాంటప్పుడు నా కూతురు నన్ను కౌగిలించుకుని, 'నువ్వు నా హీరోవి' అని చెబుతుంది. అంటే, పిల్లలు మనల్ని గమనిస్తారు. వారు మన వైఫల్యాల నుండి దృఢంగా ఎలా ఉండాలో నేర్చుకుంటారు. పడిపోవడం సహజమే అని ఆమెకు చూపించండి, అప్పై లేవండి. నా ఉద్యోగం నాకు ఇది నేర్పింది. ఏది జరిగినా నువ్వు స్థిరంగా ఉంటావని చూపించండి. మాతృత్వంలో తమకు తాము వేసుకునే ప్రశ్నల్లో కొంత అపరాధ భావనతో నిండి ఉంటాయి. నేను పిల్లలకు సరైనదే ఇస్తున్నానా, ఏమైనా తప్పులు చేస్తే.. ఇలాంటివి తలెత్తుతుంటాయి. కానీ, తెలుసుకోవాల్సింది ఏంటంటే మీరు మీ సొంత మార్గంలో ప్రయాణిస్తూ ఆమె దేనినైనా వెంబడించగల ప్రపంచాన్ని నిర్మిస్తున్నారని గుర్తించాలి. తనను తాను క్షమించుకుంటూ ముందుకు సాగడం కూడా చాలా ముఖ్యం. మీకు ఒకరి కంటే పిల్లలు ఎక్కువమంది ఉంటే ఆ బాధ్యత పది రెట్లు పెరుగుతూనే ఉంటుంది. అందుకని, పిల్లలను ప్రేమించడం కంటే కూడా న్యాయంగా ఉండడటం ముఖ్యం.

– దివ్యా మిట్టల్

రోజువారీ జీవన విధానంలో ముఖ్యమైన వాటికి సమయం ఇస్తూ, తమ పనిని బ్యాలెన్స్ చేసుకుంటూ, చేస్తున్న పని గురించి పిల్లలకు క్లారిటీ ఇవ్వడం వల్ల మెరుగైన ప్రయోజనాలను పొందుతారు.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

యుక్త వయసు



తల్లిదండ్రులు పిల్లల కోసం కష్టపడుతుంటారు.
పిల్లలు చదువులతో కష్టపడాలి వాస్తవంగా.
కాని వారికి సోషల్ మీడియాలోని
చెత్తా చెదారం, తప్పుడు సమాచారం,
ఉద్రిక్త ఆకర్షణలు, హింసాత్మక భావజాలాలు...
ఇవి కష్టాలు తెచ్చి పెడుతున్నాయి.
ఇటీవల వచ్చిన 'అదోలసెన్స్' వెబ్‌సిరీస్
మీద సర్వత్రా చర్చ జరుగుతున్నది.
ఇది హెచ్చరిక అంటున్నారు.
ఈ సిరీస్ మనల్ని ఎలా నిద్ర లేపుతున్నది?

డిజిటల్ లోయల్లో టీనేజ్ పిల్లలు

మీ పిల్లలు మీతో ఇంట్లో మాట్లాడే భాష మీకు తెలుసు. వాళ్లు సోషల్ మీడియాలో మాట్లాడే భాష మీకు తెలుసా? వాళ్లు ఉపయోగించే 'ఎమోజీ'ల అర్థాలు తెలుసా? మాటలు లేకుండా ఎమోజీలతో గాయపరిచే వీలు ఉంటుందని తెలుసా? కిడ్నీ బీన్స్, రెడ్ పిల్, బ్లూ పిల్, డైనమైట్, రెడ్ హార్ట్, పర్పుల్ హార్ట్, ఎల్లో హార్ట్.... ఈ ఎమోజీల అర్థం ప్రతి దానికీ మారుతుంది. అవి ఎందుకు ఉపయోగిస్తున్నారు. ఇంట్లో మన ఎదురుగా పిల్లలు ఎలా ప్రవర్తిస్తున్నారో మీకు తెలుసు. సోషల్ మీడియాలో ఎలా ప్రవర్తిస్తున్నారో మీకు తెలుసా?

ముఖ్యంగా వారి వయసు 12– 14 సంవత్సరాల మధ్య ఉంటే వారికి తెలిసింది ఎంత... తెలియంది ఎంత... తెలిసీ తెలియంది అంత.

జాగ్రత్త సుమా... అని హెచ్చరించడానికి వచ్చింది 'అడోలసెన్స్' అనే వెబ్ సిరీస్.

నాలుగు ఎపిసోడ్స్‌ల సిరీస్

'అడోలసెన్స్' అనేది నాలుగు ఎపిసోడ్ల మినీ వెబ్ సిరీస్. బ్రిటిష్ క్రైమ్ డ్రామా. బ్రిటన్‌లో టీనేజీ పిల్లల్లో పెరుగుతున్న హింసా ప్రవృత్తిని గమనించి ఈ సిరీస్‌ను తీశారు. జాక్ థోర్న్ స్క్రిప్ట్ రాస్తే, ఫిలిప్ బరాన్‌టిని దర్శకత్వం వహించాడు. ఒక్కో ఎపిసోడ్ ఒక గంట ఉంటుంది. విశేషం ఏమిటంటే ప్రతి ఎపిసోడ్ సింగిల్ షాట్. అంటే మధ్యలో కట్ లేకుండా కెమెరా కదులుతూ దృశ్యాలను చూపుతూ వెళుతుంది. ఈ మేకింగ్‌లో వినూత్నత వల్ల కూడా ఈ సిరీస్ ప్రశంసలు అందుకుంటోంది.

ఆ పసివాడి సంఘర్షణ

ఈ సిరీస్ మొదలు కావడమే 'జెమీ మిల్లర్' అనే 13 ఏళ్ల పిల్లవాడి అరెస్టుతో మొదలవుతుంది. ముందు రోజు రాత్రి స్కూల్లో తన క్లాస్‌మేట్ అమ్మాయి కేటీని కత్తితో ఏడుసార్లు పొడిచి చంపాడని అభియోగం. తండ్రి, తల్లి, సోదరి హడలిపోతాడు. జెమీ మిల్లర్ అయితే పోలీసులను చూసి ప్యాంట్ తడుపుకుంటాడు. ఆ తర్వాత జేమీనే కేటీని చంపాడని ఇందుకు ఒక స్నేహితుడు కూడా పురిగొల్పాడని విచారణలో ప్రేక్షకులకు అర్థమవుతూ ఉంటుంది. అయితే ఇందులో ఎవరి తప్పు ఎంత? దీనికి బాధ్యులు ఎవరెవరు? శిక్ష మాత్రం ఒక్కడికే పడబోతోందా?

ఎవరు నిందితులు?

సోషల్ మీడియాను, ఎమోజీలను కనిపెట్టిన వారా? వాటిని ఫోన్లకు అనుసంధానం చేసిన వారా? పిల్లలకు ఫోన్లు కొనిచ్చిన తల్లిదండ్రులా? వాళ్లు ఏ మీడియాను ఉపయోగిస్తున్నారో చూడని తల్లిదండ్రుల నిర్బాధ్యతా? వారితో గడపలేని బిజీతో ఉన్న తల్లిదండ్రుల నిర్లక్ష్యమా? సరిగా పెంచని, సరిగా విద్యాబుద్ధులు చెప్పని వారంతా ఇందుకు బాధ్యులు కాదా? సమాజంలో పేరుకున్న హింసా ప్రవృత్తిని దూరం చేయలేని పాలనా వ్యవస్థ, శాసన వ్యవస్థ, పౌర వ్యవస్థల్లో ఉన్న వీరంతా కాదా బాధ్యులు.

ఇన్‌స్టా గొడవ

జెమీ వయసు 13 ఏళ్లే అయినా అతనికి ఇన్‌స్టా అకౌంట్ ఉంది. అందమైన ఫిమేల్‌మోడల్స్ బొమ్మలను అప్పుడప్పుడు షేర్ చేస్తుంటాడు. అతని పోస్టులకు కేటీ కామెంట్స్ పెడుతూ ఉంటుంది. వాటికి రకరకాల ఎమోజీలు వాడుతుంటుంది. అవి జెమీని బాధ పెట్టాయని మనకు తెలుస్తుంది. జెమీ తన వయసులో అపరిపక్వత వల్ల తను ఆకర్షణీయంగా లేడని తనను ఎవరూ ఇష్టపడరని న్యూనతతో ఉంటాడు. కేటీ కామెంట్స్ ఇందుకు ఆజ్యం పోస్తాయి. అంతే కాదు సాటి మనిషి పట్ల, ఆడపిల్లల పట్ల సెన్సిటివ్‌గా ఉండాలనే భావజాలం కాకుండా వాళ్లను ఏమైనా అనొచ్చు ఎలాగైనా ఉండొచ్చు అనే ఆధిపత్యపు భావజాలమే ఎక్కువగా జెమీకి పరిచయం అవుతుంటుంది. వీటన్నింటి దరిమిలా అతడు కేటీ ప్రాణం తీసేవరకూ వెళతాడు.

టీనేజ్ పిల్లలు ఎంతో సున్నితమైన దశలో ఉండే సీతాకోక చిలుకలు. వారిని గురించి అందరికీ బాధ్యత ఉండాలని చెబుతోంది ఈ సిరీస్. ఇందులోని ముఖ్య పాత్రను ఒవెన్ కూపర్ అనే బాల నటుడు అద్భుతంగా పోషించాడు. దిన పత్రికల వార్తలు కూడా మనకు రోజూ టీనేజ్ పిల్లల సమస్యలు, కుటుంబాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థ లోపం పట్టి ఇస్తున్నాయి. తల్లిదండ్రులు ఈ సిరీస్ చూడటం మంచిదంటున్నారు అభిరుచి ఉన్న ప్రేక్షకులు. కొందరైతే టీనేజ్ పిల్లలతో పాటుగా తల్లిదండ్రులూ చూడాలని సూచిస్తునారు. ముందు పెద్దలు చూడండి. ఆ తర్వాత మీకు సబబని అనిపిస్తే పిల్లలకు చూపించండి. కానీ ఆలోచించండి.

బ్యూటీ

నిర్లక్ష్యమే అసలైన సమస్య

అందంగా ఉండటం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందనేది అందరూ అంగీకరించాల్సిందే. యవ్వనంగా కనిపించాలనే తాపత్రయంతోనే జీవనం నాణ్యంగా గడపడానికీ ప్రయత్నించాలి. అందుకు బ్యూటీ చికిత్సలకు ఎక్కువ ఖర్చు పెట్టనవసరం లేదు. నేటి రోజుల్లో కాలుష్యం, సమతుల ఆహార లోపం, స్ట్రెస్ .. వీటన్నింటి ప్రభావం చర్మంపై పడుతుంది. అందుకని సమస్య ఎక్కడ ఉన్నదో దానిని పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలి.

చాలా మంది ఎదుర్కొనేవి...

యవ్వనంలో ఉన్నవాళ్లైతే యాక్నె, మంగు మచ్చలు, కాస్మాటిక్స్ వాడకం వల్ల ఏర్పడే మచ్చల సమస్య ఉంటుంది. వీటికి ఇంట్లోనే సొంత చికిత్సలు తీసుకోవడం వల్ల మరికొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉదాహరణకు.. మొటిమలకు వెల్లుల్లి, టూత్‌పేస్ట్ వంటివి వాడుతుంటారు. మంగు మచ్చలకు తమకు తామే స్టెరాయిడ్స్ వాడుతుంటారు. ఇక శిరోజాల విషయంలో అయితే ఐరనింగ్, స్ట్రెయిటనింగ్, స్టయిలింగ్.. వంటి హెయిర్‌స్టైల్స్ ఎక్కువైపోయాయి. వీటివల్ల చర్మ ఆరోగ్యం దెబ్బతింటుంది. జుట్టు ఊడిపోవడం పెరుగుతుంది.



బట్టల వల్ల అలెర్జీ

టైట్‌గా ఉండే బట్టలు వేసుకుంటుంటారు. ఫ్యాబ్రిక్ వల్ల దురద సమస్యలు వస్తుంటాయి. అవి, నిర్లక్ష్యం చేస్తే కుటుంబంలో మిగతా వారికీ ఆ ఇన్ఫెక్షన్ వ్యాపిస్తుంది. పులిపిర్లు ప్రైవేట్ పార్ట్స్‌లో వస్తుంటాయి. వాటినీ నిర్లక్ష్యం చేస్తుంటారు. కాస్మొటిక్ ప్రయోగాలు అయితే చెప్పలేం. అవి తమ చర్మానికి సరిపడతాయో లేదో కూడా చూడరు. దీని వల్ల చర్మం రంగు మారుతుంది.

ఫేషియల్స్

ఫెషియల్స్ చేయించుకుంటుంటారు. ఫ్రూట్ ఫేషియల్స్ సాధారణ కాంతికి పనిచేస్తాయి. హైడ్రా ఫేషియల్, డెర్మాఫేషియల్స్, కెమికల్ పీల్.. వంటి ఫేషియల్స్ నిపుణుల పర్యవేక్షణలోనే చేయించుకోవాలి. హెయిర్‌కి, స్కిన్‌కి పీఆర్‌పీ చేయించుకుంటారు. ఇవి చేయించుకున్నంత మాత్రాన అంతా బాగయిపోదు. సరైన మెయింటెనెన్స్ అవసరం.

చెయిన్లతో మెడపై నలుపు

ఆడవాళ్లలో చాలా వరకు మెడపైన నల్లగా అవుతుంది. ఆర్టిఫిషియల్ జ్యువెలరీ, శుభ్రత పాటించకపోవడం, అధికబరువు వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. అండర్ ఆర్మ్స్ డార్క్‌గా ఉన్నప్పుడు నిపుణుల సూచనలు తీసుకోవాలి. అధికబరువుకు లైపోసక్షన్ వంటివి చికిత్సలు తీసుకుంటారు. బరువు తగ్గినప్పుడు ఎలాంటి ఫిట్‌నెస్ సూచనలు పాటించాలో కూడా నిపుణుల సూచనలు తీసుకోవాలి.

స్ట్రెచ్ మార్క్స్

మహిళలకు ప్రసవం తర్వాత స్ట్రెచ్ మార్క్స్ పెద్ద సమస్య. ప్రసవం తర్వాత మూడవ నెల వరకు క్రీములు వాడుతూ ఉండాలి. అన్ని డెలివరీలు పూర్తయ్యాక స్ట్రెచ్ మార్క్ ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. మరో సమస్య పాదాల పగుళ్లు. క్రీమ్ వాడితే దాని మీద దుమ్ము పేరుకుంటుంది. అందుకని, రాత్రి పడుకునేముందు పాదాలను శుభ్రం చేసి, క్రీమ్ రాసి, సాక్సులు ధరించాలి.

డిటర్జెంట్స్ వల్ల ఎగ్జిమా!

చేతులకు ఎగ్జిమా వస్తుంది. డిటర్జెంట్స్ వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. అందుకని ఇంటి క్లీనింగ్‌లో చేతులకు గ్లౌజ్స్ మోచేతుల వరకు ఉండేవి మార్కెట్లో లభిస్తున్నాయి. వాటిని ఉపయోగించాలి.

పర్మనెంట్స్ చేయించుకుంటున్నారా..!

బ్యూటీ చికిత్సలలో పర్మనెంట్ మెథడ్స్‌కి ఇటీవల డిమాండ్ పెరిగింది. వాటిలో బొటాక్స్, ఫిల్లర్స్, స్కిన్ బూస్టర్స్, లిప్ కరెక్షన్, స్కిన్ టైటెనింగ్, గ్లోయింగ్ కోసం తీసుకునే ఇంజక్షన్స్.. ఈ కాస్మొటిక్స్ చికిత్సలన్నీ వైద్యుల పర్యవేక్షణలోనే తీసుకోవాలి. రెగ్యులర్ మేకప్ చేసుకునేవారు కాస్మొటిక్స్ తమ చర్మతత్త్వానికి సరిపడేవి ఎంచుకోవాలి. తిరిగి శుభ్రం చేసుకోవడంలోనూ జాగ్రత్తలు పాటించాలి.

– డా.స్వప్నప్రియ, డెర్మటాలజిస్ట్



ఫ్యాషన్

ప్రకృతి పరవశం

పచ్చని తోరణాలు.. షడ్రుచుల ఆస్వాదన.. సంప్రదాయ వస్త్రధారణ
ఉగాదికి స్వాగతం పలుకుతూ
కొత్త ఉత్సాహాన్ని మదికి మోసుకువస్తాయి.
చేనేత చీరలు, ఎంబ్రాయిడరీ సొగసులు వాటి రంగుల హంగులు
ప్రకృతి పరవశించేలా పండగకు మరింత శోభను తీసుకువస్తాయి.
ముఖ్యంగా పసుపు, ఆరెంజ్, ఆకుపచ్చ, ఎరుపు రంగులు
పండగ కళను రెట్టింపుగా మన కళ్లకు కడతాయి.



డిజైన్లు

చెక్స్, లైన్స్‌తో ఉన్న డిజైన్లు, మెరుపులు లేకుండా థ్రెడ్ ఎంబ్రాయిడరీ వర్క్, సహజంగా అనిపించే పెయింటింగ్స్ ఈ పండగకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

చేనేత కళ

పండగ నాడు కళను రెట్టింపు చేసే అలంకరణకు ప్రాముఖ్యత ఇస్తుంటారు. అయితే, అందుకు పెద్ద హడావిడి లేకుండా మనవైన చేనేతలలో కాంతిమంతమైన రంగులున్న చీరలను ఎంపిక చేసుకోవచ్చు. వీటిలో కంచిపట్టు చీరల నుంచి కలనేత వరకు అన్నీ పండగను వెలిగించేవే.

సహజమైన రంగులు

ప్రకృతి నేపథ్యంగా ఉగాది జరుపుకుంటారు కాబట్టి పసుపు, ఆకుపచ్చ, నారింజ, ఎరుపు రంగుల కాటన్, తెలుపు, ఎరుపు కాంబినేషన్, పింక్ కలర్ టస్సర్, సిల్క్ చీరలు ప్రత్యేక ఆకర్షణతో ఆకట్టుకుంటాయి.

ఇతర అలంకరణలు..

- చీరలకు లాంగ్ స్లీవ్స్ బ్లౌజులు, టెంపుల్ జ్యువెలరీ లేదా థ్రెడ్, టెర్రకోట జ్యువెలరీ బాగుంటాయి.
- పసుపు, ఎరుపు కాంబినేషన్ ప్లెయిన్ గాజులు, సహజంగా అనిపించేలా తక్కువ మేకప్ ప్రత్యేకతను చూపుతుంది.
- శిరోజాల అలంకరణలో జడ, కొప్పులు, పువ్వులకు ప్రాధాన్యమిస్తే పండగ ప్రకృతి కళతో ఆకట్టుకుంటుంది.



